క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మ రాజుల వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసే దుకాణాల వద్ద రుసుము వసూళ్లకు ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 27 వరకు గల 18 రోజుల లీజుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్జీఓ నాయకులు

కార్వేటినగరం: చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ పుత్తూరు తాలుకా అధ్యక్షుడు టీ.గిరిప్రసాద్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎన్జీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రకౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుత్తూరు తాలుకా అధ్యక్షుడు గిరిప్రసాద్ మాట్లాడుతూ ఎన్జీఓస్ సమావేశానికి ఉద్యోగస్తులు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీఓస్ సభ్యులు శశిధర్‌రెడ్డి, హేమాద్రి, ఉపాధ్యక్షుడు కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్పనాయుడు, లోకనాథం, గాయత్రి, దేవేంద్ర పలువురు పాల్గొన్నారు.

గంగ జాతర కమిటీ సమావేశం రేపు

పుత్తూరు రూరల్: పుత్తూరు గ్రామ దేవత పిడికిలి గంగమ్మ జాతర నిర్వహణ నిమిత్తం కమిటీ సమావేశాన్ని ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నారు. స్థానిక బజారు వీధిలోని సుందరం షాపు వద్ద నిర్వహించే ఈ సమావేశానికి కమిటీ సభ్యులందరూ హాజరు కావాలని నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్వహణపై సూచనలు, సలహాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శుక్రవారం రూ.10 లక్షలతో నిర్మించనున్న అంకాలమ్మ ఆలయానికి ఎంపీపీ మురగయ్య ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దళితవాడలో కూడా హిందూ ఆలయాలు నిర్మాణాలు చేపట్టాలనే ఉద్దేశంతో టీటీడీ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితవాడలను పట్టించుకున్న పాపాన పోలేదని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అనంతరం వేద పండితులు, వేదమంత్రాల నడుమ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్, మాజీ సర్పంచ్ అంకయ్య, జేజేలు రెడ్డి, శ్రీనివాసులు, శేషాద్రి, ధన్‌రాజ్, మహిళలు పలువురు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలో పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, ఇప్పటికీ వేయించుకోని వారు ఉంటే గుర్తించి, రెండు రోజుల్లో ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, గిరిజ, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం సొసైటీకి రెండోస్థానం



అవార్డు అందుకుంటున్న సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి

పాలసముద్రం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాలసముద్రం సొసైటీకి ద్వితీయ స్థానం వచ్చిందని సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన 'ది ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు లిమిటెడ్' కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే పాలసముద్రం సొసైటీ మంచి పనితీరు కనబరిచి ద్వితీయ స్థానం రావడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.

అక్రమాలకు కేరాఫ్ టీడీపీ.. అభివృద్ధికి కేరాఫ్ వైఎస్సార్‌సీపీ

- గతంలో పుత్తూరు ఈశ్వరాలయ కోనేరును పూడ్చింది టీడీపీ నేత ముద్దుకృష్ణమ నాయుడే
- కాంప్లెక్స్ నిర్మాణాలకు భూమిపూజ చేసింది ఆయనే..!
- అవి కూడా కార్యరూపం దాల్చలేదు
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి ఆర్‌కే రోజా నేతృత్వంలో కోనేరు పునఃనిర్మాణం
- అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు టీడీపీ నేతల కుయుక్తులు



పుత్తూరు ఈశ్వరాలయంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కోనేరు

పుత్తూరు రూరల్: అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణాలను కోర్టుల ద్వారా మోకాలడ్డు పెట్టిన తెలుగుదేశం పార్టీ నాయకులు, పుత్తూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను సైతం కోర్టు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులని ప్రజలు అభివర్ణిస్తున్నారు. పుత్తూరు పట్టణంలోని కోనేరును పూడ్చి వేసింది తెలుగుదేశం పార్టీ దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడే అన్న విషయం పట్టణ ప్రజలందరికీ తెలుసు. సదరు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన టీడీపీ నాయకులు, నిర్మాణ పనులు చేపట్టకనే 'గాలి'కి వదిలేశారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి ఆర్‌కే రోజా నేతృత్వంలో కోనేరు పునఃనిర్మాణంతో పాటు సదాశివేశ్వరస్వామి వాహనాల మండప నిర్మాణం జరుగుతోంది. ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని టీడీపీ నేతలు కోర్టు ద్వారా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

అసలు వాస్తవం ఏంటంటే..!

పుత్తూరు పట్టణంలో ప్రసిద్ధి గాంచిన శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా పట్టణ నడిబొడ్డున కోనేరు (పుష్కరిణి) ఉండేది. కోనేరుకు నాలుగు వైపులా వ్యాపార సముదాయం ఉండేది. తెలుగుదేశం పార్టీ దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు 2006లో వ్యాపారాల సముదాయాలన్నింటిని కూల్చి వేసి, కోనేరును సైతం పూడ్చి వేశారు. మళ్లీ దశాబ్దం తర్వాత 2016 ఏప్రిల్ 29న కోనేరు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముద్దుకృష్ణమ నాయుడు శంకుస్థాపన చేశారు. అయితే పనులు ప్రారంభం కాకపోవడంతో కార్యరూపం దాల్చలేదు.



కోనేరు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముద్దుకృష్ణమ నాయుడు(ఫైల్)

తరువాత కాలంలో మంత్రి రోజా పుష్కరిణి పునఃనిర్మాణానికి నడుం బిగించారు. దేవదాయ శాఖ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కోనేరుతో పాటు చుట్టూ గార్డెన్, ఒక స్టేజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కోనేరు ప్రారంభమైన తర్వాత ఇక్కడ ప్రతి సోమవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి మండపాన్ని, స్వామివారి వాహనాలను భద్రపరచడానికి మండపాలను సైతం నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం కోనేరు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు నేడు జరుగుతున్న అభివృద్ధి పనులపై కోర్టులో పిటిషన్ వేయడాన్ని స్థానిక ప్రజలు తప్పు పడుతున్నారు.

దేవదాయ ఈఓకు నోటీసులిచ్చాం..



పట్టణంలో కోనేరుతో పాటు వాహన మండప నిర్మాణాలకు సంబంధించి స్థానిక దేవదాయ ఈఓకు నోటీసులు జారీ చేశాం. 2023 జనవరి 6వ తేదీన, జనవరి 23న రెండు దఫాలుగా నోటీసులు ఇవ్వడం జరిగింది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖ వారు ఆధ్యాత్మికపరంగా జరుగుతున్న నిర్మాణాలకు లైసెన్స్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

– కేఎల్ఎన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

పడవేటమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం దళితవాడ సమీపంలో ఉన్న పడవేటమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారి పూజకు కావలసిన పూజాసామగ్రిని పంబవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. 10 గంటలకు వేదపండితులు నవగ్రహ హోమం, శాంతిహోమం తదితర యాగశాల పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేపట్టారు. సాయంత్రం అగ్గి తొక్కడానికి ఉన్న భక్తులకు వేదపండితులు కాపుకట్టారు. శనివారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేపడతారు. ఆదివారం అమ్మవారిని పుష్పపల్లకిలో సుందరంగా అలంకరించి అమ్మవారి ఎదుట అగ్గితొక్కే కార్యక్రమం జరుగుతుంది.

డ్వాక్రా సంఘాల సభ్యులతో సమీక్ష

పాలసముద్రం : మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో పొదుపు సక్రమంగా కట్టుకుని పొదుపుల్లో నగదు పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్రాలు, వీఓ లీడర్లకు ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ అంతర్గత ఆడిట్, బహిర్గత ఆడిట్ పాలసీలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ వారు ఇచ్చిన సూచనలను అమలు పరచాలన్నారు. మండల మహిళ సమాఖ్య పరిధిలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై వివరించారు. బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్ర, లీడర్లపై ఉందని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, లీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

వైభవంగా ఆడి పూజలు





గంజిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో ఓరుగుంటాలమ్మ

నగరి : పట్టణ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో ఆడి శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. ఆడి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకం కావడంతో ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. స్థానిక ఓంశక్తి ఆలయంలో ఈ పూజలను పురస్కరించుకుని కరకంఠేశ్వర స్వామి ఆలయం నుంచి 450 మంది ఎరుపు దుస్తులు ధరించిన భక్తులు గంజిని ఊరేగింపుగా ఓంశక్తి ఆలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గెరిగనాట్యాల నడుమ తీసుకెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఊరేగింపులో అమ్మవారి వేషధారణలో వచ్చిన చిన్నారులు పలువురిని ఆకర్షించారు. భక్తులు తెచ్చిన గంజి, అంబలిని ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలుగా పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా పోస్టల్ డిపార్ట్‌మెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. ఓరుగుంటాలమ్మ ఆలయంలో ఆడి శుక్రవారం పూజల్లో భాగంగా అమ్మవారికి స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అభిషేకానంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

రుబెల్లా నిర్మూలనకే మిషన్ ఇంద్రధనస్సు

నగరి : మమ్స్, రుబెల్లా పూర్తిగా నిషేధించడానికే 'మిషన్ ఇంద్రధనస్సు' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో, నిండ్ర మండలకేంద్రంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మమ్స్, రుబెల్లా వ్యాధులను ఈ ఏడాదితో పూర్తిగా లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాక్సిన్లు వేసుకోక మధ్యలో వదిలేసిన వారు, పూర్తిగా వ్యాక్సిన్లు వేసుకోని వారి వివరాలను ఇప్పటికే సర్వేల ద్వారా సేకరించడం జరిగిందన్నారు. వారందరికీ వ్యాక్సిన్లు వేయాలన్నారు. అలాగే ఈ నెల 10వ తేదీన నులి పురుగుల మందులు అందించడం జరుగుతుందన్నారు. తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, సీడీపీఓ కృష్ణవేణి, ఎంఈఓ శ్రీదేవి, ఆశాలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

అపోహలు వీడండి



గుళికలు పంపిణీ చేస్తున్న డాక్టర్ షర్మిళ

గంగాధరనెల్లూరు: నులిపురుగుల గుళికలపై చిన్నారులు అపోహలు వీడాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ షర్మిల అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నులిపురుగురు నివారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ గుళికలపై ఉన్న అపోహల గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి ప్రతి చిన్నారికి గుళికలు అందించాలని సూచించారు. నులిపురుగుల నివారణకు ఈ గుళికలు తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం పాఠశాలల వారీగా హెచ్ఎంలకు ఎంఈఓ ఆంజనేయులుశెట్టి చేతుల మీదుగా గుళికలను పంపిణీ చేశారు. తహసీల్దార్ ఇన్బనాథన్, డాక్టర్ ప్రశాంత్, సీహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

10న నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

విజయపురం (నగరి): ఈ నెల 10న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీల్లో నులిపురుగుల నివారణకు వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు చేత మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎంఈఓ ఆంజనేయులు, తహసీల్దార్ వెంకట్రాయులకు మాత్రల కిట్‌లను అందించారు.

అట్టహాసంగా అలుగుకుండ ఉత్సవం



అలుగును ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో నిర్వహిస్తున్న ద్రౌపదమ్మ తిరనాళ్లలో భాగంగా శుక్రవారం అలుగు కుండ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ ఆధ్వర్యంలో పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు అలుగు కుండను తలపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలోని ద్రౌపదమ్మ విగ్రహం సమీపంలో అలుగును ఉంచారు. కార్యక్రమాన్ని వీక్షించడానికి ఆలయం వద్ద అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు. అలుగుతో పాటు ప్రత్యేక అలంకరణలో ఉన్న ద్రౌపదీ, ధర్మరాజ స్వాములను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీవీఎన్‌ఆర్ పురంలో ఆర్డీఓ పర్యటన



టీవీఎన్‌ఆర్‌పురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

పాలసముద్రం : మండలంలోని తిరువెంగలనాథరాజుపురం గ్రామాన్ని శుక్రవారం నగరి ఆర్డీఓ సుజన సందర్శించారు. నెల రోజుల కిందట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామంలో నిర్వహించారు. ఆ సమయంలో గ్రామస్తులు కొన్నేళ్లుగా తాము సుమారు 150 ఎకరాల భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నామని, అయితే ఆ భూములు కాలువ పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని డిప్యూటి సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఫోన్‌లో సమస్యను వివరించారు. గ్రామానికి వచ్చి వారు సాగు చేస్తున్న భూమిని పరిశీలించి వారి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ మేరకు టీవీఎన్‌ఆర్ పురం గ్రామానికి వచ్చిన ఆర్డీఓ సుజన రెవెన్యూ సిబ్బందితో కలసి కాలువ పొరంబోకు భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా బోర్లు వేసుకుని చెరుకు, వరి, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తున్నామని, అయితే తమకు పట్టాలు లేవని విన్నవించారు. అనుభవంలో ఉండే రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. త్వరలో రెవెన్యూ సిబ్బంది వచ్చి అనుభవంలో ఉన్న రైతుల వివరాలు సర్వే చేసి సేకరిస్తారని చెప్పారు. అనంతరం ఎస్‌కేఆర్ పురం, సీఎం కండ్రిగ శ్మశానాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, సర్వేయరు కిరణ్‌కుమార్, వీఆర్‌ఓ శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
- వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదలు ధనికులుగా మారారు
- ప్రతి ఇంటా ప్రజలు ఆనందంగా ఉన్నారు
- మంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): పేదలకు సొంతింటి కల నెరవేరాలంటే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేసీ పల్లి పంచాయతీలో గుత్తావాండ్ల ఊరు, కంబాలచేను, కేసీ పల్లి దళితవాడ, కేసీ పల్లి ఏఎడబ్ల్యూ, కేసీ పల్లి గ్రామాల్లో సర్పంచ్ వాణిశ్రీ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరాలంటే జగనన్న రావాలని, రాష్ట్రానికి పట్టిన చీడ పురుగు చంద్రబాబు పోవాలన్నారు. టీడీపీ నాయకులు ఆర్–5 జోన్‌కెళ్లి స్టే తేవడంపై డిప్యూటీ సీఎం నిప్పులు చెరిగారు.

సమస్యల పరిష్కారానికి చొరవ..

అనంతరం చిప్పారపల్లి గ్రామానికి చెందిన సరోజమ్మ(70) మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అనేక రకాలైన సంక్షేమ పథకాలను తనకు అందాయని, ఆయన ఎప్పుడూ చల్లగా ఉండాలని ఆశీర్వచనలు అందించింది. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గుత్తావాండ్ల ఊరుకు చెందిన ఆనందమ్మ మంత్రికి మంగళహారతి పట్టి స్వాగతం పలికింది. అనంతరం కంబాల చేను లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని మహిళలు విన్నవించగా స్పందించిన మంత్రి అధికారులతో కలిసి కంబాలచేను హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. కాలనీకి డ్రైనేజీ, విద్యుత్, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే అదే గ్రామానికి చెందిన రైతు మణి తమ గ్రామంలో గత మూడు నెలలలోపే నాలుగుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దీంతో తాగునీటి సమస్య ఏర్పడిందని మంత్రికి విన్నవించారు. స్పందించిన ఆయన జిల్లాస్థాయి విద్యుత్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించి గ్రామస్తులకు విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణం చేపడుతున్న వారికి తక్షణ సహాయం కింది డ్వాక్రా మహిళలకు అర్హతను రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సాంకేతిక కారణాల వల్ల హర్ష అనే దివ్యాంగుడికి పింఛన్ ఆగి పోయిందని తల్లిదండ్రులు మంత్రి దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, ఎంపీటీసీ సుజాత, బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, లోకేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దాము, మురళి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

మతి భ్రమించిందా గాలి భాను..!





నాడు దుస్థితిలో ఉన్న మాధవరం-అత్తూరు రోడ్డు, ప్రస్తుతం సిమెంట్ రోడ్డుతో దర్శనమిస్తున్న వైనం

- సెల్ఫీలు తీసుకోవడం కాదు.. ప్రజాసేవ చేయండి
- టీడీపీ నేత గాలి భానుప్రకాష్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల హితవు

పుత్తూరు రూరల్/నిండ్ర: సెల్ ఉంది కాదా అని సెల్ఫీలు తీసుకోవడం కాదు.. ప్రజలకు, కనీసం మీ కార్యకర్తలకైనా సేవ చేయండి అని టీడీపీ నేత గాలి భానుప్రకాష్‌కు నిండ్ర మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. శుక్రవారం వారు నిండ్రలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నిండ్ర సింగిల్‌విండో ప్రెసిడెంట్ మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా నేతృత్వంలో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధులతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అవేవీ తెలుగుదేశం పార్టీ వారికి కనిపించవని ఎద్దేవా చేశారు. మాధవరం నుంచి అత్తూరు ఎస్టీ కాలనీ వరకు రూ.7 లక్షలతో సిమెంట్ రోడ్డు వేసినట్లు తెలిపారు. అలాగే అత్తూరు ఎస్టీ కాలనీ వద్ద రూ.9 లక్షలతో కల్వర్టును సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులు మంత్రి రోజా నేతృత్వంలో జరిగాయన్నారు. సెల్ఫీలు కాకుండా ప్రజలకు అవసరమైన సేవలు చేయండి భాను అంటూ వారు హితవు పలికారు. సమావేశంలో అత్తూరు ఆర్‌బీకే డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.